క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వార్డు సచివాలయాల పరిధిలో ఉన్న హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు పూర్తిచేసేలా అవగాహన కల్పించాలన్నారు. ఎమినిటీ, వెల్ఫేర్ సెక్రటరీలు, సీఎంఎం, సీఓలు ఎప్పటికప్పుడు గృహాలను సందర్శించాలని, నిర్మాణ ప్రగతిపై నివేదికలు అందించాలని ఆదేశించారు. సమావేశంలో అర్బన్ హౌసింగ్ ఏఈ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఆశ వర్కర్ల నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఆశ వర్కర్లు

సాలూరు రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మండలంలోని మామిడిపల్లి, తోణాం, బాగువలస పీహెచ్‌సీల వద్ద మంగళవారం ఆశ వర్కర్లు నిరసన తెలియజేశారు. ఆశ వర్కర్లకు రిటైర్మెంట్ వయసు 62 సంవత్సరాలకు పెంచాలని అప్పటి ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఆ ప్రకారం ప్రభుత్వం జీవో విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్ల నిరసనకు సీఐటీయూ నాయకుడు ఎస్.వై.నాయుడు, కార్మిక సంఘం నాయకులు ఎం.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పశువులను రోడ్లపైకి విడిచిపెడితే చర్యలు




మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్

పార్వతీపురంటౌన్: పాడిపశువులను రోడ్లపైకి విడిచిపెట్టొద్దని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. పాడిపశువుల యజమానులతో మంగళవారం సమావేశమై పలు సూచనలు చేశారు. పట్టణంలోని మెయిన్ రోడ్డు, మార్కెట్ రోడ్డుపై పశువులు, పందుల సంచారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇక మీదట రోడ్లపైకి పశువులను విడిచిపెడితే వాటి యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఇప్పటికే సచివాలయ శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు సంబంధిత యాజమానులకు నోటీసులు ఇవ్వడం జరిగిందన్నారు. నిబంధనలు బేఖాతరు చేసిన యజమానులపై అపరాధ రుసుం విధించాలని ఆదేశించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మురళి, సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రీలు పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

సీతంపేట: రహదారి భద్రతా నియమాలను వాహనచోదకులు పాటించాలని ఎస్ఐ జగదీష్ నాయుడు సూచించారు. గిరిజన యువతకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం సీతంపేటలో మంగళవారం ఏర్పాటు చేశారు. రోడ్డు ప్రమాదాల నుంచి భద్రత పొందేందుకు ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మైనర్లు డ్రైవింగ్ చేయవద్దన్నారు. వారికి పెద్దలు వాహనాలు ఇవ్వకూడదని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. వాహన చోదకులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్సు, వాహన ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు.

మాతా, శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలి



బాలేరు పీహెచ్‌సీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ విజయపార్వతి

భామిని: సంపూర్ణ అభియాన్ పోషణ కార్యక్రమాన్ని వైద్య సిబ్బంది క్షేత్ర స్థాయి నుంచి సమన్వయంతో నిర్వహించి మాతా, శిశు మరణాలకు అడ్డుకట్ట వేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ కె.విజయపార్వతి అన్నారు. మండలంలోని బాలేరు, భామిని పీహెచ్‌సీల పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన పలు శాఖల సమన్వయ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విస్తృత ప్రచారం, గ్రామాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీలు, ఆశా కార్తకర్తలు సమన్వయంతో పని చేయడం ద్వారా సత్ఫలితాలు వస్తాయన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంపూర్ణ అభియాన్ పోషణ పథకం ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు.

వసూళ్లకు కేరాఫ్.. రక్త పరీక్ష కేంద్రాలు

- మలేరియా, టైఫాయిడ్, డెంగీ ప్యాకేజీలంటూ వసూళ్లు
- ల్యాబ్‌ల వద్ద కానరాని ధరల పట్టికలు
- ముందుల కంటే రక్త పరీక్షల ఖర్చే అధికం





పట్టణంలోని ఓ ప్రైవేట్ ల్యాబ్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ (ఫైల్)

పార్వతీపురంటౌన్:

పల్లె, పట్టణం అన్న తేడా లేదు.. మంచం పట్టని గ్రామం అంతకన్నా లేదు.. వీధివీధినా.. ప్రతీ ఇంట్లో ప్రజలు జ్వరాలతో అల్లాడుతున్నారు. జ్వరంతో పాటు కాళ్ల వాపులు, ఒళ్లు నొప్పులు వేధిస్తున్నాయి. వచ్చింది ఏ జ్వరమో తెలుసుకునేందుకు రక్త పరీక్ష కేంద్రాలకు వెళ్తే మలేరియా, టైఫాయిడ్, డెంగీ ప్యాకేజీ అంటూ రూ.2వేల నుంచి రూ.2500 వరకూ వసూలు చేస్తున్నారు.

రెండు నెలలుగా విషజ్వరాల విజృంభన

పార్వతీపురం పట్టణంతో పాటు పలు గ్రామాల్లో రెండు నెలలుగా విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అంతంత మాత్రంగానే అందుతుండటంతో రోగులు ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. ఇదే అదనుగా ల్యాబ్ నిర్వాహకులు రోగులను దోచుకుంటున్నారు. ఒక్కో రక్త పరీక్షకు ఒక్కో రేటు వసూలు చేస్తున్నారు. ఏ పరీక్షకు ఎంత ధర అన్న వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయకుండా ఇష్టానుసారంగా డబ్బులు దోచుకుంటున్నారని పలువురు రోగులు వాపోతున్నారు. జ్వరపీడితులు అధికంగా ఉండటంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ పరీక్షలకు ప్రత్యేక ప్యాకేజీ అంటూ వేల రూపాయిలు వసూలు చేస్తున్నారు. జ్వర పీడితులను తమ వద్దకు పంపించిన ప్రైవేటు వైద్యులు, ఆర్ఎంపీలకు రక్తపరీక్ష కేంద్రాల నిర్వాహకులు కమీషన్లు ముట్టజెపుతున్నారు. సీజనల్ వ్యాధుల ముసుగులో రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు బాగా దండుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని పీహెచ్‌సీల్లో ఫ్లూయిడ్స్ కొరత

కొన్ని పీహెచ్‌సీల్లో జ్వరపీడితులకు ఎక్కించే సెలైన్ బాటిల్స్ తక్కువగా ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గిరిజన గ్రామాల్లో పీహెచ్‌సీలకు వచ్చిన జ్వరపీడితులు సెలైన్ పెట్టించుకోకుండా వెనుదిరిగాల్సిన పరిస్థితి నెలకొంది. డ్రగ్స్ డిపార్ట్‌మెంట్‌కు ఇండెంట్ పెట్టామని, ప్రస్తుతం ఇతర పీహెచ్‌సీలతో సర్దుబాటు చేసుకుని పేషంట్లకు సమయానికి ఫ్లూయిడ్స్ అందిస్తున్నామని వైద్యులు చెపుతున్నట్లు సమాచారం.

పీహెచ్‌సీలకు పెరిగిన ఓపీ

జిల్లాలోని 37 పీహెచ్‌సీలతో పాటు 5 పట్టణ అర్బన్ హెల్త్‌సెంటర్, చేవేంద్ర పీహెచ్‌సీ ఉన్నాయి. గతంలో ఆస్పత్రుల్లో నిత్యం ఓపీకి 20 నుంచి 30 వరకు వచ్చేవారు. వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వాస్పత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది పెరగడమే కాకుండా, అవసరమైన మందులు, రక్త పరీక్షలకు యంత్ర పరికరాలు సమకూరాయి. వైద్య సేవలు మెరుగు కావడంతో ప్రస్తుతం రోజుకు వంద మంది ఓపీ సేవలకు వస్తున్నారు. వారిలో జ్వరంతో బాధపడుతున్న వారే అధికం. రక్తపరీక్షల సామగ్రి పీహెచ్‌సీలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడంతో పరీక్షలు వేగవంతంగా చేస్తున్నారు. రోజుకు 50 మందికిపైగా పరీక్షలు చేస్తుండటం గమనార్హం.

జిల్లాలో ల్యాబ్‌ల వివరాలు	
ప్రైవేట్ ల్యాబ్‌లు	14
ప్రైవేట్ ఆస్పత్రులలో ల్యాబ్‌లు	34
పాలీక్లినిక్‌లలో ల్యాబ్‌లు	35

డిస్‌ప్లే బోర్డులు తప్పనిసరి



రక్త పరీక్ష కేంద్రాల్లో ధరలకు సంబంధించి డిస్‌ప్లేబోర్డులు తప్పనిసరిగా ప్రదర్శించాలి. అధిక ధరలు వసూలు చేస్తున్న ల్యాబ్‌లను గుర్తించి ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం నిర్దేశించిన ల్యాబ్‌లలో మాత్రమే రక్త పరీక్షలు చేయించుకోవడం మంచిది. అన్ని పీహెచ్‌సీలలో రక్త పరీక్షలు నిర్వహిస్తున్నాం. ప్రజలు గమనించాలి.

– డాక్టర్ టి.జగన్మోహనరావు, డిప్యూటీ డీఎంహెచ్ఓ, పార్వతీపురం

చర్యలు తీసుకుంటాం



రక్త పరీక్ష కేంద్రాల నిర్వాహకులు అధిక ధరలు వసూలు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం. అధిక ధరలు వసూలు చేస్తున్న వారి వివరాలు అందిస్తే అక్కడకు వెళ్లి విచారణ చేస్తాం. ల్యాబ్‌లలో తనిఖీలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించాం. ఎక్కడ అధికంగా వసూలు చేసినా తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ విజయ పార్వతి, డీఎంహెచ్ఓ, పార్వతీపురం

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం



పార్వతీపురంటౌన్: సమావేశంలో మాట్లాడుతన్న ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

- ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురంటౌన్: రానున్న ఐదు సంవత్సరాలలో రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడం ధ్యేయంగా ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పార్వతీపురం ఎమ్మెల్యే బోనేల విజయచంద్ర అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా పార్వతీపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో పార్వతీపురం శ్రీవేంకటేశ్వర గవ్నమెంట్ డిగ్రీ కాలేజీ ఆవరణంలో మంగళవారం మినీ జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్‌డీఏ ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్ మేళాలు నిర్వహిస్తోందని, వాటిని యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శ్రీవేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ బి.శాంతికుమారి మాట్లాడుతూ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సహకారంతో మరిన్ని జాబ్‌మేళాలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యూ.సాయికుమార్ మాట్లాడుతూ జాబ్ మేళలను నిరుద్యోగ యువత అందిపుచ్చుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. మినీ జాబ్ మేళాలో వనిత లాబ్స్, మంజుశ్రీ టెక్నో ప్యాక్, కె.ఎల్.గ్రూప్–అమెజాన్ ప్రతినిధులు పాల్గొని అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. మేళాకు 205 మంది అభ్యర్థులు హాజరుకాగా 89 మంది ఎంపికయ్యారు. కార్యక్రమంలో జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి లోచర్ల రమేష్, జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆర్.వహీదా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించాలి

బలిజిపేట: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందేవిధంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఎమ్మెల్యే విజయ్‌చంద్ర సూచించారు. బలిజిపేట పీహెచ్‌సీలో సిబ్బందికి స్టేట్‌బ్యాంక్ మంజూరు చేసిన వైద్య పరికరాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎస్ఆర్ కింద స్టేట్‌బ్యాంక్ వారు రూ.8 లక్షల విలువైన వైద్యపరికరాలను పీహెచ్‌సీకి అందించినట్లు చెప్పారు. పీహెచ్‌సీలు, సబ్‌సెంటర్ల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహనరావు, వైద్యాధికారులు క్రాంతి కిరణ్మయి, మాధవి, ఎంపీడీఓ విజయలక్ష్మి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్లు తొలగించేందుకు ప్రయత్నాలు

- వైఎస్ ఎంపీపీ రెడ్డి సురేష్

సాలూరు రూరల్: మండలంలోని పెదపదం పంచాయతీలో పింఛన్ల పంపిణీలో టీడీపీ నాయకుల పెత్తనం ఎక్కువగా ఉందని, వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల పింఛన్ల తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండల వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ ఆరోపించారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని పలువురు టీడీపీ నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులు కాకపోయినా ప్రతీ నెల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటున్నారని, పలువురిని వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులుగా గుర్తించి వారి పింఛన్లు తొలగిస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని అన్నారు. గ్రామంలో పెదపదం పంచాయతీలో పెదపదం లక్ష్మణ, పెదపదం పరమేసు, బాలగుడబ రాము, తదితరులకు పింఛన్ డబ్బులు ఇవ్వకుండా నిలుపుదల చేశారని, తాను కలుగజేసుకుని అధికారులను నిలదీయడంతో వారికి పింఛన్ డబ్బులు అందజేశారన్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే నాయకుల ఒత్తిడితో ఈ పని చేయాల్సి వస్తోందని అధికారులు బదులిస్తున్నారని అన్నారు. ఇలా చేస్తే ఉద్యోగులు ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు.

రక్తహీనత నివారణకు చర్యలు

సీతంపేట: మాతా శిశు మరణాలు అరికట్టాలని ఎంపీడీఓ కె.గీతాంజలి అన్నారు. కుశిమి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంపూర్ణత అభియాన్‌లో భాగంగా ఎంఎల్‌హెచ్‌పీ, అంగన్‌వాడీ సిబ్బందికి మంగళవారం సమావేశం నిర్వహించారు. రక్తహీనతను తగ్గించడం, పోషకాహారం తీసుకోవడంపై గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు.

జీడి మొక్కల పంపిణీ

మక్కువ: మండలంలోని 14 పంచాయతీలకు చెందిన లబ్ధిదారులకు ఎన్ఆర్ఈజీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం జీడి మొక్కలను పంపిణీ చేశారు. 91 మంది రైతులకు 6,650 జీడి మొక్కలను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ తెలిపారు. ఉద్యాన తోటల సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంపై రైతులకు అవగాహన కల్పించారు. రైతు సంక్షేమం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు పథకాలను అమలు చేస్తున్నాయని, అందులో భాగంగా రైతులకు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో జీడి మొక్కలను అందిస్తున్నట్లు తెలిపారు. జీడి తోటల సాగుతో ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వరమ్మ, ఈసీ వెంకటలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు మొక్కలు అందిస్తున్న ఎంపీడీఓ సూర్యనారాయణ

నిరుపేద కుటుంబానికి సాయం



నగదు అందజేస్తున్న సంజీవనాయుడు, గ్రామస్తులు

బలిజిపేట: విశాఖ కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్న నిరుపేద కుటుంబానికి పెదపెంకి గ్రామానికి చెందిన గుడివాడ హరినాథ్ రూ.10 వేలు వైద్య ఖర్చుల నిమిత్తం వితరణ చేశారు. ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి మంగళవారం అందజేసినట్లు నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవ నాయుడు తెలిపారు. గ్రామానికి చెందిన డర్రు సుమన్ అనారోగ్యంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు.

అతని ఆర్థిక పరిస్థితిని హరినాథ్‌కు వివరించగా ఆయన వెంటనే స్పందించి రూ.10 వేలు పంపించినట్లు చెప్పారు. గ్రామ పెద్దలు, యువకుల సమక్షంలో ఈ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేసినట్లు తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలి



మక్కువ: సిబ్బందికి సూచనలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహనరావు

- డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహనరావు

బలిజిపేట: ఆరోగ్య కార్యక్రమాలను పూర్తిస్థాయిలో నిర్వహించాలని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ జగన్మోహనరావు అన్నారు. బలిజిపేట పీహెచ్‌సీలో నిర్వహిస్తున్న ఆశ డే కార్యక్రమాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ పరిధిలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. వ్యాధులు ప్రబలుతున్న గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వ్యాధుల వ్యాప్తికి కారణాలను గుర్తించి, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా అమలు చేయాలని, చిన్నారులు, గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా చూడాలన్నారు. మలేరియా, డెంగీ, తదితర సీజనల్ వ్యాధులు విజృంభించకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరాల బాధితుల జాబితాను ఎప్పటికప్పుడు సిద్ధం చేయాలని, రోగులకు సత్వరమే చికిత్సలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే ప్రోగ్రాం అధికారి రఘుకుమార్, వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి, మాధురి, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పౌష్టికాహార లోపం నివారణకు చర్యలు తీసుకోవాలి

మక్కువ: గర్భిణులు, శిశువుల్లో పౌష్టికాహార లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జగన్మోహనరావు వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలకు సూచించారు. మండలంలోని మక్కువ, శంబర పీహెచ్‌సీల్లో, సాలూరు పీపీ యూనిట్‌లో మంగళవారం ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పోషణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులు, శిశువుల జాబితాను రూపొందించాలని సూచించారు. అన్ని గ్రామాల్లో వైద్యసిబ్బంది పర్యటించి వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని, రోగులకు సత్వర చికిత్స అందించాలన్నారు. మందులు, వ్యాధి నిర్ధారణ పరీక్షల కిట్లను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్బీఎస్కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ రఘుకుమార్, మక్కువ, శంబర, సాలూరు వైద్యాధికారులు కిరణ్‌కుమార్, నిఖిల, శశిధర్, కిరణ్మయి, మాధురి, ప్రియాంక, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

- ఉత్సవాల అనుమతులకు సింగిల్ విండో విధానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు
- అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు
- ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి



పార్వతీపురంటౌన్/ సాలూరు:

వినాయక చవితి ఉత్సవాల నిర్వహణకు సంబంధించి అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగిల్ విండ్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చిందని ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి తెలిపారు. ఉత్సవ నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని సూచించారు. స్థానిక విలేకరులతో మంగళవారం సమావేశమై సింగిల్ విండో విధానాన్ని వివరించారు. గతంలో వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు అగ్నిమాపక శాఖ, పురపాలక శాఖ, విద్యుత్ శాఖ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర(ఎన్ఓసీ) పత్రం తీసుకోవాల్సి ఉండేదని, కానీ ఇప్పుడు ఒకే దరఖాస్తుతో అన్ని శాఖల అనుమతులు పొందేలా ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకొచ్చిందన్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు ఇలా...

ఉత్సవ నిర్వాహకులు 7995095800 మొబైల్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపిస్తే మండపాల ఏర్పాటుకు అనుసరించాల్సిన ప్రక్రియ మొత్తం మీ ఫోన్‌కు వస్తుందన్నారు. హెచ్‌టీటీ పీఎస్//గణేష్‌ఉత్సవ్.నెట్ వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి, న్యూ అప్లికేషన్ మీద క్లిక్ చేసి, దరఖాస్తు చేస్తున్న వ్యక్తి ఫోన్ నంబర్ ఎంటర్ చేస్తే, ఓటీపీ వస్తుందని, ఓటీపీ నంబరు ఎంటర్ చేసిన తరువాత, మొబైల్ నంబరు వెరిఫికేషన్ పూర్తయి దరఖాస్తు విండో ఓపెన్ అవుతుందన్నారు. దరఖాస్తు ఫారంలో దరఖాస్తుదారుని పేరు, ఈ మెయిల్ అడ్రస్, చిరునామ, ఉత్సవ కమిటీ సభ్యుల పేర్లు, వారి ఫోన్ నంబర్లు, మండపం ఏర్పాటు చేసే స్థలం, విగ్రహం ఎత్తు, విగ్రహ నిమజ్జన తేదీ, సమయం, ఊరేగింపులో వినియోగించే వాహనం వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. అనంతరం ఆ దరఖాస్తు సంబంధిత పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌ఓకి వెళ్తుంది. ఎస్‌హెచ్ఓ ఆధ్వర్యంలో పురపాలక శాఖ, అగ్ని మాపక శాఖ, విద్యుత్ శాఖల సిబ్బందితో కూడిన బృందం మంటపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తుంది. నిబంధనలకు అనుగుణంగా ఉంటే సమీపంలోని మీసేవ కేంద్రంలో చలాన కట్టి హెచ్‌టీటీ పీఎస్//గణేష్‌ఉత్సవ్.నెట్ /అప్లికేషన్ స్టేటస్‌లో ఫోను నంబరు ఎంటర్ చేసినట్లయితే అనుమతులు మంజూరు చేస్తూ నిరభ్యంతర పత్రం, పాటించాల్సిన నిబంధనలతో కూడిన క్యూఆర్ కోడ్ డౌన్లోడు అవుతుందని తెలిపారు. వాటిని లేమినేషను చేసి, ఉత్సవ మండపంలో ఉంచుకోవాలి. తనిఖీలకు వచ్చే అధికారులకు దాన్ని చూపించాల్సి ఉంటుంది. శాంతిభద్రతల సమస్యల తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఉత్సవాలు జరుపుకోవాలని సూచించారు.



సాలూరు: వినాయక ఉత్సవాల నిర్వహణ, సైబర్ నేరాలపై ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న సీఐ అప్పలనాయుడు

పాటించాల్సిన నిబంధనలు

- ఉత్సవ విగ్రహాలను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ఏర్పాటు చేసుకోవాలి.
- కమిటీ సభ్యుల ఆధార్, అడ్రసులు ఫోన్ నెంబర్లు తీసుకోవాలి. పూజ దినముల వివరములు తీసుకోవాలి.
- మండపాల వద్ద శబ్ద కాలుష్యం చేసే స్పీకర్లను ఉపయోగించరాదని, స్పీకర్లను ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే వినియోగించాలి.
- మండపాల వద్ద విగ్రహాలకు భద్రతగా కమిటీ సభ్యులు రాత్రులు కాపలాగా ఉండాలి.
- వినాయక నిమజ్జనం చేసే సమయాలను, రూట్ మ్యాప్‌ను ముందుగా పోలీసులకు తెలియజేయాలి.
- వినాయక నిమజ్జనం ఉపయోగించే వాహనం వివరాలు, రికార్డ్స్, డ్రైవరు లైసెన్సు తీసుకోవాలి, మద్యం సేవించి వాహనం నడపరాదు.
- డ్రైవరు వద్ద అండర్ టేకింగ్ లెటర్ తీసుకోవాలి.
- వినాయక చవితి మండపాల వద్ద ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలగకుండా వాహనాలను ఒక పక్కగా పార్కింగ్ చేసేలాగా ఏర్పాట్లను చేయాలి.
- దీపారాధన సమయంలో, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్ని ప్రమాదాలు జరగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలి. మండపాల వద్ద సీసీ కెమెరాలు, ఇసుక బస్తాలు, నీటి బకెట్లు ఏర్పాటు చేసుకోవాలి.
- మండపాల వద్ద గాని, ఊరేగింపులలో గాని బాణసంచాను ఉపయోగించరాదు.
- వినాయక నిమజ్జనం సమయంలో అశ్లీల డాన్సులు, డీజే శబ్దాలు చేయకూడదు.
- వ్యక్తులను రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించకూడదు.
- బలవంతపు చందాలు, వసూళ్లు, దర్శనాల టికెట్లు పెట్టరాదు. ఎవరైనా అటువంటి చర్యలకు పాల్పడితే వాటిపై ఫిర్యాదులు చేసేందుకు డయల్ 100కి ఫోన్ లేదా సంభందిత పోలీస్ స్టేషన్‌కి ఫిర్యాదు చేయాలి.
- ప్రతి మండపానికి వారి సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి పోలీస్ సిబ్బందిని కో–ఆర్డినేటర్‌గా నియమించడం జరుగుతుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్, కృత్రిమ రంగులు ఉపయోగించిన విగ్రహాలను పర్యావరణ పరిరక్షణ నిమిత్తం ఉపయోగించరాదని, మట్టితో తయారు చేసిన విగ్రహాలను ఉపయోగించాలి.
- హుండీ రాత్రి పూట మండపంలో ఉంచరాదు.
- కమిటీ సభ్యులు రాత్రి సమయంలో మండపం వద్ద కాపలాగా ఉండాలి. నిర్వాహకులు సీసీటీవీ తప్పనిసరిగా ఏర్పాటు చేయాలి
- మండపాలు వద్ద ట్రాఫిక్ అంతరాయం కలిగించకూడదు విగ్రహాల దగ్గర వాహనాలు పార్కింగ్ చేయరాదు.
- నిమజ్జనం నిర్దేశించిన సమయములో ఊరేగింపు ప్రారంభించి, నిర్ణీత సమయంలో నిర్దేశించిన ప్రాంతంలో మాత్రమే నిమజ్జనం చేయాలి.
- నిమజ్జనం రాత్రి 10 గంటలలోపు ముగించాలి.
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలి.